సాక్షి వికారాబాద్

బుధవారం ; 15 ; అక్టోబర్ ; 2025



లాభాల పూబంతి

పూల సాగుతో పలువురు రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. పండుగలను దృష్టిలో ఉంచుకుని తోటలు సాగు చేశారు. 10లో▸



హామీలు అమలు చేయాలి

విభజన హామీలను అమలు చేయాలని రివాల్యూషనరి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. 10లో▸



ఇసుక పర్మిట్ల జారీలో..

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక రవాణా కోసం జారీ చేస్తున్న పర్మిట్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. 11లో▸

న్యూస్‌రీల్

ఆర్‌పీఎఫ్ ఎస్ఐకి ఇండియన్ పోలీస్ మెడల్



పతకం అందుకుంటున్న సుధాకర్

అనంతగిరి: వికారాబాద్‌లోని ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జాలా సుధాకర్ ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్నారు. గుజరాత్‌లోని వలసాడ్‌లో జరిగిన ఆర్‌పీఎఫ్ రైజింగ్ డే సందర్భంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేతులమీదుగా అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సన్నిహితులతో పాటు జిల్లా ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: తాండూరు మార్కెట్ యార్డులో దడువాయిగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణి మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. అర్హులైన 9 మందికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పదో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. 35 సంవత్సరాల లోపు వారు మాత్రమే అర్హులని తెలిపారు. దరఖాస్తు తోపాటు విద్యార్హత, మెడికల్ ఫిట్నెస్, వయసు నిర్ధారణ సర్టిఫికెట్లు జత చేయాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 7330733618లో సంప్రదించాలని సూచించారు.

గోవులను రక్షించుకుందాం



మాట్లాడుతున్న తెలంగాణ ప్రాంత గో సేవా ప్రముఖ్ వెంకట నివాస్‌జీ

ఇబ్రహీంపట్నం: గో సంతతిని కాపాడుకోవాలని, గోవులను రక్షించుకుంటేనే ప్రకృతి పరంగా జీవరాసులన్నింటికీ మంచి భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ ప్రాంత గో సేవా ప్రముఖ్ వెంకట నివాస్‌జీ అన్నారు. జిల్లా స్థాయి గో విజ్ఞాన పరీక్షలను మంగళవారం ఇబ్రహీంపట్నంలోని త్రిశక్తి ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో సంతతి పెరిగితేనే భూసారం పెరుగుతుందని తెలిపారు. గోవుల పాల ఉత్పత్తులతోపాటు గో ఆధారిత వ్యవసాయం చేస్తే మనమంతా ఉండగలుగుతామన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పుడు 30 కోట్ల జనాభా, 80 కోట్లకు పైగా పశు సంతతి ఉండేదని చెప్పారు. ప్రస్తుతం 20 కోట్ల పశువులు మాత్రమే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పశుసంతతిని పెంపొందించుకునేందుకు, వాటిని రక్షించుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విభాగ్, జిల్లా గో సేవా ప్రముఖులు వేణుగోపాల్, రచమళ్ల అబ్బయ్య, సుధాకర్‌రెడ్డి, బుగ్గవరపు రమేష్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఇబ్రహీంపట్నం: సీజేఐ గవాయ్‌పై దాడి అంటే రాజ్యాంగం, పార్లమెంట్, దేశం మొత్తంపై జరిగిన దాడిగా చూడాల్సిందేనని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సీజేఐపై దాడిని నిరసిస్తూ కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్ అధ్యక్షతన మంగళవారం ఇబ్రహీంపట్నంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సామేల్‌తోపాటు కార్యదర్శి ప్రకాశ్ కారత్, బీఎస్పీ నాయకుడు కొండ్రు రఘుపతి, తెలంగాణ ఉద్యమకారులు బోసుపల్లి వీరేష్‌కుమార్, రాములు, మారయ్య, పూసల సంఘం రాష్ట్ర నాయకుడు పురుషోత్తం, రజక సంఘం నాయకుడు ముదిగొండ అజయ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాడి చేసిన.. దాని వెనుకల ఉన్న నిందితులను కఠినంగా శిక్షిస్తేనే భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉంటాయన్నారు. సమావేశంలో వెంకటేశ్, బండి సత్తయ్య, కాలె గణేశ్, కాళ్ల జంగయ్య, ఎం.రాజు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


నేడు అసైన్డ్ భూములపై సమావేశం

యాచారం: మండలంలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 19, 68, 127లోని అసైన్డ్, ప్రభుత్వ భూములపై గ్రామ రైతులతో బుధవారం సమావేశం ఉంటుందని తహసీల్దార్ అయ్యప్ప తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. నోటిఫికేషన్ వేసిన 820 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి ఏం చేయాలనే విషయమై చర్చించడం జరుగుతుందని ఆయన వివరించారు.

ఇక పోరాటమే!

ఏకతాటిపైకి ట్రిపుల్‌ఆర్ బాధిత రైతులు

- జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు
- నవాబుపేట మండల కేంద్రంగా కార్యాచరణ
- జూబ్లీహిల్స్ ఉపపోరులో పోటీ చేయాలని నిర్ణయం
- కృష్ణారెడ్డి పేరు ప్రతిపాదన
- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా ముందుకు..



రీజినల్ రింగ్‌రోడ్డు నమూనా చిత్రం

వికారాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులు ఒక్కతాటిపైకి వచ్చారు. జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటై పోరుబాటకు సిద్ధమయ్యారు. మిగతా జిల్లాల రైతులతో జతకట్టాలని నిర్ణయించారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చిన నాటి నుంచే హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల్లో దుమారం రేగింది.రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో నెలా పదిహేను రోజులుగా ఉద్యమిస్తున్నారు. అధికారులకు వినతి పత్రాలు అందజేయడం, కలెక్టరేట్ల వద్ద నిరసనలు, రహదారుల దిగ్బంధం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తరచూ నిరసన గళం వినిపిస్తూనే ఉన్నారు. రీజినల్‌కు తమ పొలాలు ఇచ్చేది లేదని తేల్చి చెబుతున్నారు. తాజాగా మంగళవారం బాధిత రైతులు నవాబుపేట మండలం చించల్‌పేటలో సమావేశమయ్యారు. ఆయా గ్రామాల రైతులు కలిసి జేఏసీగా ఏర్పాటయ్యారు. ఉద్యమ కార్యాచరణకు సిద్ధమయ్యారు. అలాగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్ వేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు.

అలైన్‌మెంట్ మార్పుతోనే..

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చడంతోనే సమస్య మొదలైంది. పాత అలైన్‌మెంట్(పడమర వైపు) ప్రకారం పొరుగు జిల్లా రంగారెడ్డి పరిధిలోని ఆలూరు – కొకుంట్ల గ్రామాల మధ్యలోంచి తంగేడుపల్లి మీదుగా ట్రిపుల్ ఆర్ వెళ్లేలా ప్రతిపాదించారు. దీని ప్రకారం మన జిల్లా పరిధిలోని పూడూరు, నవాబుపేట మండలాలకు చెందిన ఒకటి రెండు గ్రామాల మీదుగా వెళ్లేలా డిజైన్ చేశారు. తాజా అలైన్‌మెంట్ వల్ల జిల్లాలోని నాలుగు మండలాలపై ప్రభావం పడింది. పూడూరు, నవాబుపేట మండలాల్లోని 20కి పైగా గ్రామాలు రీజినల్ పరిధిలోకి రాగా.. వికారాబాద్, మోమిన్‌పేట మండలాల్లోని ఐదారు గ్రామాల మీదుగా రోడ్డు వెళ్లేలా ప్రతిపాదనలు తయారు చేశారు. దీంతో రైతులు పోరుబాట పట్టారు.

ప్రభావిత గ్రామాలు..

- పూడూరు మండలంలోని గొంగుపల్లి, గట్‌పల్లి, కెరవెళ్లి, మంచన్‌పల్లి, మన్నెగూడ, పెద్ద ఉమ్మెంతాల్, పూడూరు, రాకంచర్ల, సిరిగాయపల్లి, తుర్కెన్కెపల్లి, ఎన్కెపల్లి మీదుగా ట్రిపుల్ ఆర్ వేయనున్నారు.
- నవాబుపేట మండలంలోని చించల్‌పేట్, చిట్టిగిద్ద, దాతాపూర్, నవాబుపేట, వట్టిమీనపల్లి, యావాపూర్ గ్రామాల మీదుగా..
- వికారాబాద్ మండలంలోని పీరంపల్లి, పులుసుమామిడి, బురాన్‌పూర్, పాతూర్ గ్రామాల మీదుగా వెళ్లనుంది.
- మోమిన్‌పేట మండలంలోని దేవరంపల్లి, టేకులపల్లి గ్రామాల మీదుగా రీజినల్ వేయనున్నారు.

ఒత్తిడి పెంచేందుకు..

జిల్లాలోని ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు మిగతా జిల్లాల రైతులతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. అన్ని జిల్లాలను కలుపుకొని ఉమ్మడి జేఏసీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు. అంతేకాకుండా త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. నవాబుపేట మండలం చించల్‌పేట గ్రామానికి చెందిన బాధిత రైతు కృష్ణారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించాలని ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చారు. మిగతా ప్రాంతాల రైతులతో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే బీఆర్ఎస్ తరఫున గెలిచి ప్రస్తుతం అధికార పార్టీలో కొనసాగుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్వగ్రామం నుంచే ఈ ఉద్యమ కార్యాచరణ ప్రారంభించడం గమనార్హం.

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు

- స్పీకర్ ప్రసాద్‌కుమార్



మ్యూజియంను తిలకిస్తున్న ప్రసాద్ కుమార్

అనంతగిరి: లండన్ నగరంలో బీఆర్ అంబేడ్కర్ నివసించిన గృహాన్ని మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సందర్శించారు. అంబేడ్కర్ జ్ఞాపకార్థం ఆయన నివసించిన ఇంటని మ్యూజియంగా మార్చారు. అక్కడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఉపయోగించిన లైబ్రరీని, పడక గదిని, ఫొటో గ్యాలరీని, వినియోగించిన వస్తువులను సందర్శించారు. విజిటర్స్ పుస్తకంలో తన అనుభవాలను రాశారు. ఈ ఇంటిని సందర్శించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వీ నర్సింహా చార్యులు, స్పీకర్ ఓఎస్డీ పీ వెంకటేశం, అధికారులు ఉన్నారు.

పార్టీ కోసం శ్రమించిన వారికే పదవులు

- అందరి ఆమోదంతోనే డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక
- ఏఐసీసీ జిల్లా ఇన్‌చార్జ్ సూరజ్‌సింగ్ ఠాగూర్



సమావేశంలో మాట్లాడుతున్న సూరజ్‌సింగ్ ఠాగూర్

పరిగి: కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించిన వారికే పదవులు దక్కుతాయని ఏఐసీసీ జిల్లా ఇన్‌చార్జ్ సూరజ్‌సింగ్ ఠాగూర్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు సూచించిన నాయకులకే పదవులు వరిస్తాయని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన వారి జాబితా తమ వద్ద ఉందన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ నాయకులు బెల్లయ్య నాయక్, పీసీసీ ఉపాధ్యక్షుడు నీలిమ, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేవీలో మంచి అవకాశాలు

- కెప్టెన్ అశుతోష్ కుమార్ ఆపండ్కర్



సదస్సులో మాట్లాడుతున్న కెప్టెన్ అశుతోష్ కుమార్ ఆపండ్కర్

హుడాకాంప్లెక్స్: 'డీజీ షిప్పింగ్ సాగర్ మే సమ్మాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సరూర్‌నగర్ వీఎంహోంలో స్కూల్ విద్యార్థులకు పదో తరగతి, ఇంటర్ తరువాత ఉద్యోగావకాశాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీజీ షిప్పింగ్ నోడల్ ఆఫీసర్, ట్రైనింగ్ రెహమాన్ కళాశాల ప్రిన్సిపాల్ డా.అశుతోష్ కుమార్ ఆపండ్కర్ మాట్లాడుతూ.. పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు మర్చంట్ నేవీలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నేవీ రంగంలో మహిళలకు పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించాలని, మహిళా సాధికారత సాధించే లక్ష్యంతో ముదుకు వెళ్తున్నామని అన్నారు. మర్చంట్ నేవీలో 10వ తరగతి తరువాత ఒక సంవత్సరం శిక్షణ ఉంటుందని, ఇంటర్ తరువాత మూడేళ్ల బీఎస్సీ డిగ్రీ చదివిన వెంటనే వంద శాతం ఉద్యోగాలు మంచి వేతనంతో దొరుకుతాయని చెప్పారు. ట్రైనింగ్ షిప్ రెహమాన్ మర్చంట్ నేవీ శిక్షణలో అనేక కోర్సులు అందిస్తోందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మర్చంట్ నేవీలో విద్యార్థుల సంఖ్య పెరగాలని ఆకాంక్షించారు. మర్చంట్ నేవీలో ట్రైనింగ్ తీసుకుంటున్న విద్యార్థిని భీమగాని సత్య మాట్లాడుతూ.. విద్యార్థులు రొటీన్‌కు భిన్నంగా ఆలోచించాలని, ప్రత్యేక శిక్షణతో నేవీ రంగంలోకి అడుగు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు మనీషా పాండే, వీఎంహోం ప్రిన్సిపాల్ పి.నర్సింహారెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భీమగాని మహేశ్వర్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఇసుక అక్రమ రవాణాకు.. అడ్డుకట్ట వేయండి

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పని చేసి అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆదేశించారు. విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మైన్స్ ఏడీ సత్యనారాయణ, గ్రౌండ్ వాటర్ ఏడీ రవి, ఏఓ పర్వీన బేగం, డీ సెక్షన్ సూపరింటెండెంట్ మునీర్, ఈడీఎం మహమూద్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థుల సంక్షేమం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. మంగళవారం నగరం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో విద్యా బోధన, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో డీటీడీఓ కమలాకర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి మాధవ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

పత్తి పంట మద్దతు ధరకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణి, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల యోగక్షేమాలపై ఆరా

జిల్లాలో కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల యోగ క్షేమాలపై కలెక్టర్ ఆరా తీశారు. మంగళవారం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్ కలెక్టర్ పాల్గొని పిల్లలతో మాట్లాడారు. వారి ఆరోగ్యం, విద్య, అందిన ఆర్థిక సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి, బీఆర్‌బీ కో ఆర్డినేటర్ కాంతారావు, డీసీపీఓ శ్రీకాంత్, పీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు

ఇబ్రహీంపట్నం రూరల్: టీజీఐఐసీకి భూములు కోల్పోయిన అర్హులైన రైతులందరికీ ఇంటి స్థలాలు ఇస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎల్మినేడులో మంగళవారం భూ సేకరణ, రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు పర్యటించారు. పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూ పరిరక్షణ సమితి, ఇతర రాజకీయ పార్టీల నాయకులు వేర్వేరుగా ఆర్డీఓకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద అర్హుల జాబితా ఉందని స్పష్టం చేశారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ప్రభుత్వం చేసిన ఎంజాయ్‌మెంట్ సర్వే ఆధారంగా త్వరలోనే లే ఔట్ చేసి ప్లాట్లు అప్పగించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కమీషన్ విడుదల చేయండి

మహేశ్వరం: పెండింగ్ కమీషన్ డబ్బులు విడుదల చేయాలని మంగళవారం పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ రఘునందన్‌రావును రేషన్ డీలర్ల సంఘం నాయకులు కలిశారు. కమీషన్ సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. త్వరలో విడుదలయ్యే విధంగా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన రేషన్ డీలర్లు

పరిహారం ఇవ్వాల్సిందే

- లేకుంటే పరిశ్రమను మూసేయిస్తాం
- 'చెట్టినాడ్' ప్రతినిధులపై ఎంపీ కొండా ఫైర్
- ఎమ్మెల్యే బీఎంఆర్‌కు ఫోన్
- బాధిత రైతుల కోసం కలిసి రావాలని సూచన



కంపెనీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు రూరల్: తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామ సమీపంలోని చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమకు చెందిన రైల్వే ట్రాక్ వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు వారాల్లో న్యాయం చేయకపోతే ఫ్యాక్టరీని మూసివేయిస్తామని హెచ్చరించారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి సంగెంకలాన్ గ్రామంలో పర్యటించారు. అంతకుముందు కంపెనీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడారు. రైల్వే ట్రాక్ కోసం వాగులో 18 పిల్లర్లతో బ్రిడ్జి నిర్మించాల్సి ఉన్నా కేవలం మూడు పిల్లర్లు మాత్రమే వేశారని తెలిపారు. దీంతో వర్షాలు పడిన ప్రతీసారి పంట పొలాల్లోకి, ఎస్సీ కాలనీలోకి వరద పోటెత్తుతోందన్నారు. ఇంత జరుగుతున్నా పరిశ్రమ ప్రతినిధులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఫ్యాక్టరీ కారణంగా చుట్టు పక్కల గ్రామాలు నాశనం అవుతున్నాయని, ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. పరిహారం కోరిన రైతులను అరెస్ట్ చేయించడం ఏమిటని నిలదీశారు. వారికి అన్యాయం చేయాలని చూస్తే వదిలి పెట్టేది లేదన్నారు. ఇందుకోసం పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడతానని తెలిపారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. బాధిత రైతులకు అండగా నిలుద్దామని కోరారు. అవసరమైతే ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేద్దామని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్, పార్టీ ఎన్నికల జిల్లా కన్వీనర్ బాలేశ్వర్ గుప్తా, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు భద్రేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌రెడ్డిపై హాట్ కామెంట్స్

పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిపై హాట్ కామెంట్స్ చేశారు. ఆయన రాజకీయాలకు సూట్ అయ్యే వ్యక్తి కాదని వ్యాఖ్యానించారు. ఆయన సమాజ సేవ చేస్తుంటే తానే రాజకీయాల్లోకి తీసుకొచ్చానని గుర్తుచేశారు. అందరినీ కలుపుకొని పోయే వ్యక్తియే పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాడన్నారు. పార్టీలో ఎన్ని వర్గాలున్నా పార్టీ బలోపేతానికే పాటుపడాలన్నారు. త్వరలోనే ఆయన తన పదవికి రాజీనామా చేయొచ్చని తెలిపారు.

సంగెంకలాన్ ఘటనలో రాజకీయ ఒత్తిళ్లు

ఇటీవల సంగెంకలాన్‌లో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో బీజేపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి, రిమాండ్‌కు తరలించడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలకు తలొగ్గి పోలీసులు కేసు నమోదు చేసినట్లు అర్థమవుతోందని తెలిపారు. కార్యకర్తలందరినీ తప్పకుండా బయటకు తీసుకొస్తామని వెల్లడించారు.

ధైర్యంగా ఉండాలి

అనంతరం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సంజీవ్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని తెలిపారు. ధైర్యంగా ఉండాలని తాను అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ ప్రారంభం

ధారూరు: మండలంలోని నాగారం గ్రామంలో రూ.70 లక్షలతో నిర్మించిన 4జీ బీఎస్ఎన్ఎల్ సెల్ ఫోన్ టవర్‌ను మంగళవారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దిశ కమిటీ జిల్లా సభ్యుడు వడ్ల నందు, బీజేపీ నాయకులు రాజు నాయక్, వివేకానందరెడ్డి, ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

మండలంలోని రాంపూర్‌తండా, గురుదొట్ల, నాగారం గ్రామాలకు చెందిన రైతులకు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వందశాతం సబ్సిడీపై కుసుమ, నువ్వుల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూనె గింజల సాగు లాభదాయకమన్నారు. భారతీయ నూనె గింజల సంస్థ విత్తనాలను సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సురేష్, ఎస్ఆర్‌పీ ఝాన్సీరాణి, ఫీల్డ్ అసిస్టెంట్ తేజశ్రీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు కొడంగల్ బంద్

కొడంగల్: కొడంగల్‌కు మంజూరు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను లగచర్లకు తరలిస్తున్నారని నిరసిస్తూ గురువారం కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ బంద్‌కు పిలుపు నిచ్చారు. దీనికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కేడీపీ జేఏసీ కన్వీనర్ కొత్రికె లక్ష్మీనారాయణ గుప్తా, కో కన్వీనర్లు గంటి సురేశ్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, పవన్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను, గురుకులాలను కొడంగల్ శివారులోనే నిర్మించాలని వారు కోరారు.

గోదాం నిర్మాణానికి భూమి కేటాయింపు


హద్దులను పరిశీలిస్తున్న రెవెన్యూ, గిడ్డంగుల కార్పొరేషన్ అధికారులు

దుద్యాల్: మండల కేంద్రంలో గోదాం ఏర్పాటుకు పదెకరాల ప్రభుత్వ భూమిని తహసీల్దార్ కిషన్ మంగళవారం కేటాయించారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ రీజినల్ మేనేజర్ వేణుగోపాల్, మేనేజర్ విజయ్ కుమార్‌తో కలిసి కృష్ణగిరి దేవాలయ సమీపంలోని సర్వే నంబర్ 191లో పదెకరాలు గుర్తించి హద్దులు నిర్ధారించారు. అనంతరం అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నవీన్ కుమార్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది నర్సిములు, గిడ్డంగుల కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది మహేశ్ కుమార్, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, నాయకులు శ్రీశైలం గౌడ్, ఖాజా, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి


మాట్లాడుతున్న రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి ఖచ్చితంగా పదవులు లభిస్తాయని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో డీసీసీ ఎన్నికకు ఏఐసీసీ ఇన్‌చార్జి సూరజ్‌సింగ్ ఠాగూర్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పేదల పార్టీ యని, పార్టీ అభ్యున్నతికి కృషిచేసేవారికే గుర్తింపు లభిస్తుందన్నారు.

కల్యాణం కమనీయం

వైభవంగా లక్ష్మినరసింహాస్వామి వార్షికోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

పరిగి: పట్టణ కేంద్రంలోని లక్ష్మినరసింహాస్వామి వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం స్వామి వారి కల్యాణాన్ని వేద పండితులు కనుల పండుగగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి లక్ష్మిసమేతంగా పట్టణ కేంద్రంలోని పుర వీధుల గుండ పల్లకీ సేవా నిర్వహించారు.

కమ్మేసిన పొగమంచు

తాండూరు– వికారాబాద్ వయా ధారూరు రోడ్డును మంగళవారం పొగమంచు కమ్మేసింది. దట్టమైన మంచు దుప్పటితో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చాక కానీ కనిపించలేదు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. – ధారూరు


ధారూరు ప్రధాన రోడ్డుపై కురుస్తున్న పొగమంచు

లాభాల పూబంతి

- ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్న మహిళా రైతులు
- దీపావళికి పూలు కోసేందుకు ఏర్పాట్లు
- మార్కెట్ సౌకర్యం కల్పించాలని అభ్యర్థన


మల్లేపల్లిలో అరుణమ్మ సాగు చేసిన బంతి తోట

దోమ: పూల సాగుతో పలువురు రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. బతుకమ్మ, దసరా, దీపావళి, కార్తీక పౌర్ణమి పర్వదినాలను దృష్టిలో ఉంచుకుని తోటలు సాగు చేశారు. సంప్రదాయ పంటల సాగుతో ఏటా నష్టాల పాలవుతున్న కొంతమంది దోమ మండల పరిధిలోని పలు గ్రామాల్లో పూలు, కూరగాయల సాగుకు మొగ్గు చూపుతున్నారు. కొన్నేళ్లుగా వాణిజ్య పంటలు వేసిన రైతులు వరుస ప్రకృతి వైపరిత్యాలతో తీవ్రంగా నష్టపోయారు. అతివృష్టి, అనావృష్టికి తోడు చీడపీడల బెడద ఎక్కువ కావడంతో ఇప్పుడిప్పుడే ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. వీరు సాగు చేసిన బంతి, చేమంతి పూలను దీపావళికి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

ఎక్కడికక్కడే అమ్మకం

మండలంలోని మల్లేపల్లి, దిర్సంపల్లి, దాదాపూర్, బొంపల్లి తదితర గ్రామాల రైతులు బంతిపూలు, కూరగాయల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. పరిగి పట్టణంతో పాటు హైదరాబాద్ నగరానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై నారు సరఫరా చేయడంతో పాటు మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పించండి



గతంలో మేము పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేసేవాళ్లం. వరుసగా నష్టాలే రావడంతో పూలు, కూరగాయలు సాగు చేస్తున్నాం. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో సమీప పట్టణాలు, హైదరాబాద్‌కు తరలించి, విక్రయిస్తున్నాం. అధికారులు మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మేలు జరుగుతుంది.
– బంటు పార్వతమ్మ, బొంపల్లి

ఎకరం భూమిలో సాగు చేశాం



వాణిజ్య పంటలతో నష్టాలు రావడంతో బంతి పూలు సాగు చేశాం. ఎకరం భూమిలో పసు పు, ఎరుపు రంగు బంతి సాగు చేశాం. ఎకరానికి రూ.30 వేలు ఖర్చు వచ్చింది. పెట్టుబడి పోనూ రూ.70 వేల వరకు ఆదాయం వస్తుందని ఆశిస్తున్నాం. తోట వద్దే పూలు విక్రయిస్తున్నాం.
– ఎల్.కిష్టమ్మ, మల్లేపల్లి

దూర భారంతో ఇబ్బందులు



సాగు చేసిన బంతి పూలను పరిగి, హైదరాబాద్, షాద్‌నగర్ తీసుకెళ్లి విక్రయిస్తున్నాం. దూర భారంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సీజన్‌లో ధర పలికినా పండుగలు ముగిసిన తర్వాత కొనుగోళ్లు ఉండవు. స్థానికంగా మార్కెట్ వసతి కల్పిస్తే ఖర్చు తగ్గుతుంది. – డి.పద్మమ్మ, మల్లేపల్లి

స్నానానికి వెళ్లి.. నీట మునిగి

పెళ్లికి వచ్చిన వ్యక్తి మృత్యువాత


నీటిపై తేలిన నాసిరొద్దీన్ మృతదేహం

బొంరాస్‌పేట: వివాహ వేడుకకు వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గత ఆదివారం గ్రామానికి చెందిన అర్షద్‌పాషా పెళ్లి జరిగింది. గోల్కొండలో ప్లంబింగ్ పని చేసే నాసిరొద్దీన్(41) తన భార్యాపిల్లలతో కలిసి సోమవారం నిర్వహించిన వలీమా ఫంక్షన్‌కు వచ్చారు. మంగళవారం మధ్యాహ్నం పెళ్లి కొడుకుతో పాటు తన కుటుంబ సభ్యులతో కలిసి నాసిరొద్దీన్ గ్రామ శివారులోని పెద్ద వాగు ప్రాజెక్టులో స్నానానికి వెళ్లారు. ఈత రాకపోవడంతో నీట మునిగి చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలవెంకటరమణ తెలిపారు.

‘ఇంటి పర్మిషన్‌కు డబ్బులు డిమాండ్’


బాధితురాలు శ్యామలమ్మ

దోమ: ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఇవ్వమని పంచాయతీ కార్యదర్శి వద్దకు వెళ్తే రూ.6 వేలు డిమాండ్ చేస్తున్నారని రాకొండకు చెందిన పిల్లి శ్యామలమ్మ ఆరోపించారు. ఇదే విషయాన్ని తాను కొద్ది రోజుల క్రితం ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశానని, అయినా సెక్రటరీ వ్యవహారం మారలేదని తెలిపారు. 40 గజాల స్థలంలో తాను నిర్మించుకుంటున్న ఇంటికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.2 వేలు అవుతుందని, కానీ రూ.6 వేలు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి అనుమతి ఇప్పించాలని లేదంటే, మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తానని హెచ్చరించారు. ఈ విషయమై ఎంపీడీఓ గ్యామాను వివరణ కోరగా, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు


సామూహిక సీమంతం కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి తదితరులు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. పోషణ్ అభియాన్ మహోత్సవంలో భాగంగా మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారుల తల్లులకు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే రోగనిరోధక శక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రొటీన్లు, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహించొద్దని సూచించారు. చిన్నారులకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలని అన్నారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఎంఈఓ మనోహర్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్న ప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సప్రంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెచ్‌ఎం రాంచందర్, ఎన్జీఓ సభ్యులు నవ్య, తులసి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ.. శవమై తేలింది

మీర్‌పేట: బడంగ్‌పేటలో అదృశ్యమైన మహిళ మీర్‌పేట మంత్రాల చెరువులో శవమై తేలింది. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన ప్రకారం. బడంగ్‌పేట సమతానగర్‌కు చెందిన మీసాల కమల (55)కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా ఆమె మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో చికిత్స తీసుకుంటోంది. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కమల ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు రాజశేఖర్ అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మంత్రాల చెరువులో మహిళ మృతదేహాన్ని గుర్తించిన వాకర్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు హైడ్రా సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని వెలికితీసి కమలగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కమల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిందని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

మరో నలుగురు బాలురపైనా లైంగిక దాడి!

సైదాబాద్: సైదాబాద్ జైలు గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో ఒక బాలుడిపై ఔట్ సోర్సింగ్ ఉద్యోగి లైంగిక దాడి చేయడం కలకలం సృష్టించిన సంగతి విదితమే. అయితే పోలీసుల విచారణలో అతడు మరో నలుగురు బాలురిపైనా లైంగిక దాడులు చేశాడని తేలినట్లు తెలుస్తోంది. బాలుడిపై లైంగిక దాడి ఘటనను సీరియస్‌గా విచారిస్తున్న పోలీసులకు విస్తుపోయే విషయాలు వెల్లడవుతున్నామయని సమాచారం. ప్రస్తుతం సదనంలో 80 మంది బాలలు ఉండగా వారందరితో పోలీసులు ఒక్కొక్కరిగా మాట్లాడి విషయాలు రాబడుతున్నారు. ప్రస్తుతం సదనంలో కాకుండా ఇండ్లకు వెళ్లిన వారిని సైతం వారు విచారిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఓ బాలుడిపై దాడి విషయం వెలుగులోకి వచ్చిన తరువాత జువైనల్ విభాగం ఉన్నతాధికారులు మహిళా సూపరింటెండెంట్ మైథిలిని దర్యాప్తు అధికారిగా నియమించారు. ఆమె పూర్తి వివరాలతో నివేదికను అధికారులకు సమర్పించారు. ఇప్పటికే బాలుడిపై దాడి ఘటనలో నిందితుడైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రహమాన్‌ను విధుల నుంచి అధికారులు తొలిగించారు. హెడ్ సూపర్‌వైజర్ షఫీని సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు ఉద్యోగులకు చార్జి మెమో జారీ చేశారు. సైదాబాద్ పోలీసుల విచారణ పూర్తయితే ప్రభుత్వ బాలల సదనంలో దాడుల విషయమై మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. బాలల సదనంలో లైంగిక దాడి ఘటనపై కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు ఇక్కడి అధికారులను పూర్తి నివేదిక పంపాలని అడిగారని తెలుస్తోంది.

కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

బంట్వారం: కేజీబీవీలో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓలు చంద్రప్ప, వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. కోట్‌పల్లి, బంట్వారం మండల కేంద్రాల్లోని కేజీబీవీ వసతి గృహాల్లో క్రింద తెలిపిన ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు వారు మంగళవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. కోట్‌పల్లి కేజీబీవీలో స్వీపర్ (1), స్కావెంజర్ (1) ఉన్నాయని, బంట్వారం కేజీబీవీలో స్వీపర్ (1), స్కావెంజర్ (1) ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఏడవ తరగతి పాసై అదే మండలానికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీస వయస్సు 18 నుంచి 45 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల అర్హులైన మహిళలు ఈ నెల 14వ తేదీ నుంచి 18 వరకు సంబంధిత ఎస్ఓలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

కేసు నమోదు

పరిగి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన పరిగి పట్టణ కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎ లాంటి అనుమతులు లేకుండా పట్టణ కేంద్రానికి ఫిల్టర్ ఇసుక తరలిస్తుండగా రెండు టిప్పర్లను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు టిప్పర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు సమాచారం. ఈ ఘటనపై ఎస్ఐ మోహన క్రిష్ణను వివరణ కోరగా స్పందించలేదు.

రివార్డు అందజేత


కానిస్టేబుల్‌కు నగదు అందజేస్తున్న ఎస్ఐ యాదగిరి

దుద్యాల్: తప్పిపోయిన మహిళలను పట్టుకున్న కేసులో దుద్యాల్ పోలీస్ స్టేషన్ సిబ్బందిలో ఇద్దరికి మంగళవారం రివార్డు అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన కొత్తూర్ బాలమణి ఈ నెల 5న తప్పిపోయింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రెండు రోజుల క్రితం ఆమె ఆచూకీ తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ అమృత, శంకర్‌లను ఎస్ఐ యాదగిరి అభినందించారు. అనంతరం వారికి రూ. వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు.

పంచాయతీ ట్రాక్టర్ నుంచి బ్యాటరీ చోరీ

నందిగామ: పార్క్ చేసిన చాకలిదాని గుట్ట తండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నుంచి గుర్తు తెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి బ్యాటరీ చోరీ చేశారు. కారోబార్ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. సోమవారం గ్రామంలో పనులు చేసిన తర్వాత సాయంత్రం పంచాయతీ కార్యాలయం ఆవరణలో ట్రాక్టర్‌కు తాళం వేసుకుని వెళ్లారు. మంగళవారం ఉదయం ట్రాక్టర్ తీసుకెళ్లేందుకు వెళ్లగా బ్యాటరీ చోరీ విషయం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గతంలో ఇదే పంచాయతీలో పలుమార్లు దొంగలు పడ్డారు. ఇప్పటికైనా పోలీసులు దర్యాప్తు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి


మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కొడంగల్: కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయాలని రివాల్యూషనరి విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొడంగల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాల విభజన సందర్భంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్రాలకు నిధులు, నియామకాల్లో సమాన న్యాయంతో పాటు రెండు ప్రాంతాల అభివృద్ధికి అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. విభజన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం నిధులు కేటాయించడంలో జాప్యం చేస్తుందని విమర్శించారు. రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలను ఓటర్లుగానే చూస్తున్నారని విమర్శించారు. ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో ఢిల్లీ వేదికగా రెండు రాష్ట్రాల విద్యార్థులతో కలిసి ఆందోళన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు, శ్రీనివాస్, మహేశ్, వెంకటేశ్, అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.

వేటకు వెళ్లిన వ్యక్తి మృత్యువాత

- పంటకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి దుర్మరణం
- బాణాపూర్ శివారులో ఘటన


శేఖర్ మృతదేహం, పక్కన నాటు తుపాకీ, టార్చిలైట్

యాలాల: అటవీ ప్రాంతంలో వేటకు వెళ్లిన వ్యక్తి.. ఓ పంట పొలానికి రక్షణగా ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం బాణాపూర్ శివారులో వెలుగు చూసింది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన గురుదొట్ల శేఖర్(40) ఈనెల 9న బాణాపూర్‌కు చెందిన పెంట్యానాయక్‌తో కలిసి వేటకు వెళ్లి తిరిగిరాలేదు. ఈ విషయమై సోమవారం అతని భార్య కవిత యాలాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంగళవారం ఉదయం బాణాపూర్ పరిధి సర్వే నంబరు 52లోని నీరటి షాకప్ప, నీరటి రాజుకు చెందిన పొలాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి శేఖర్ చనిపోయిట్లు గుర్తించారు. మృతదేహం వద్ద నాటు తుపాకీతో పాటు టార్చిలైట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా తాను, శేఖర్ కలిసి మద్యం తాగామని, అనంతరం తాను ఇంటికి వెళ్లిపోగా, శేఖర్ ఒక్కడే వేటకు వెళ్లాడని పెంట్యానాయక్ చెబుతున్నట్లు తెలిసింది. విచారణ అనంతరం శేఖర్ మృతికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

అడిషనల్ డీఆర్‌డీఓ నర్సిములు


మాట్లాడుతున్న నర్సిములు

తాండూరు రూరల్: జిల్లాలో మహిళా సంఘాలను బలోపేతం చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ నర్సిములు పేర్కొన్నారు. మంగళవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా మండలాల ఐకేపీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ.. ఏపీఎంలు, సీసీలు గ్రామాల్లో ఎప్పటికప్పుడు మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించాలన్నారు. ఆయా మండలాలకు ఇచ్చిన బ్యాంక్ లింకేజీ రుణాల టార్గెట్‌ను పూర్తి చేయాలని సూచించారు. స్త్రీనిధి రుణాలకు సంబంధించి గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాల్లో మొండి బకాయిలను త్వరగా కట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు శేఖర్, నర్సిములు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జానకీ, ఆయా మండలాల ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

బషీరాబాద్ ఎస్ఐని సస్పెండ్ చేయాలి

- దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే బాధితుడిపై కేసు పెడతారా?
- న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తాం
- రాష్ట్ర దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు జంగయ్య


మాట్లాడుతున్న జంగయ్య తదితరులు

బషీరాబాద్: దాడి చేసిన వ్యక్తులపై అర్ధరాత్రి 100 కాల్ చేసి ఫిర్యాదు చేస్తే బషీరాబాద్ పోలీసులు బాధితుడిపై కేసు పెట్టడం విడ్డూరంగా ఉందని దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాల జంగయ్య పేర్కొన్నారు. ఎస్ఐ నుమాన్‌అలీని వెంటనే విధుల్లో నుంచి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేందటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మంగళవారం బాధితులైన సిహెచ్ రాజు, అర్చన దంపతులు, దివ్యాంగులతో కలిసి బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. దామర్‌చెడ్ గ్రామంలో సెప్టెంబర్ 30 అర్ధరాత్రి బోయిని వెంకటయ్య అనే వ్యక్తి రాజు, అర్చన దంపతులను దూశిస్తూ దాడి చేశాడని, అదే రోజు రాత్రి 100కి కాల్ చేసి ఫిర్యాదు చేసినట్లు, మరునాడు మధ్యాహ్నం కూడా కేసు పెట్టే వరకు స్పందించలేదని ఆయన మండిపడ్డారు. ఈ వ్యవహారంలో దాడి చేసిన వ్యక్తితో పోలీసులు కుమ్మక్కై, బాధితులపై కేసులు పెట్టి తమ నైజాన్ని చాటుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లులేని రాజు ఎలా దాడి చేస్తాడని ప్రశ్నించారు. ఈ కేసులో సాక్షాలు తారుమారు చేసి రాజుకుటుంబంపై పోలీసులు కక్షపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎస్ఐను సస్పెండ్ చేసేవరకు వదలబోమని జంగయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, జిల్లా కార్యదర్శి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ చారి, మండల అధ్యక్షుడు ద్యావరి నర్సిములు, నాయకులు విజయ్‌కుమార్, నర్సిములు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి కిష్ట, మండల అధ్యక్షుడు కొనగేరి నర్సిములు, అంజిలప్ప, కిష్టప్ప, సాయిలు, జర్నమ్మ, రవికుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ‘ఐక్యత’ సహకారం

టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి


హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందిస్తుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ పరిధిలోని కర్కస్‌తండాలో మంగళవారం సుంకిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని చెప్పారు. అలాగే ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయాల పునరుద్ధరణ, అభివృద్ధి, నూతన ఆలయాల నిర్మాణం కోసం ఆర్థికసహకారం అందిస్తున్నామని వివరించారు. కల్వకుర్తి నియోజక వర్గంలో ఇప్పటివరకు 160 ఆలయాల అభివృద్ధికి సాయం అందించామని ఆయన గుర్తు చేశారు. కర్కస్‌తండాలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి అవసరమైన ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, నాయకులు శంకర్ నాయక్, నర్సింహ, రవి, కరుణాకర్‌రెడ్డి, గోపాల్ నాయక్, శ్రీను, శివాజీ, మల్లేశ్, రాజేందర్, నార్యా, సంతోశ్, కృష్ణ, బాలకోటి, దేవేందర్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మాక్‌డ్రిల్

శంషాబాద్: విమానాశ్రయంలో బాంబులు పెడితే వివిధ ఏజెన్సీలన్నీ సమన్వయంగా సమస్యను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై శంషాబాద్ విమానాశ్రయంలో మంగళవారం మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు ప్రతి సంవత్సరం నిర్వహించిన మాదిరిగా ఈ ఏడాది బాంబులు పెడితే కలిగే నష్టం..దానిని నివారించే విధానంపై డ్రిల్ చేపట్టారు. కార్గో ఏరియాలో చేపట్టిన ఈ డ్రిల్‌లో సీఐఎస్ఎఫ్ అధికారుల బృందంతో పాటు రక్ష సెక్యూరిటీ, వైద్యులు, రాష్ట్ర పోలీసులు, ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు. తనిఖీలు, నిర్వీర్యం, వైద్యసాయం తదితర అంశాలపై మాక్‌డ్రిల్ విజయవంతంగా పూర్తిగా చేశారు.